క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ బేబి

నందికొట్కూరు: సమాచార హక్కు చట్టం గురించి అందరికీ అవగాహన అవసరమని మున్సిపల్ కమిషనర్ బేబి స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని సచివాలయం-6 వద్ద సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు అడిగిన ప్రతి సమాచారం నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని చెప్పారు. సమాచార హక్కు చట్టం పట్ల ఎవరు నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ డీఈ నాసీర్, టీపీఓ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి



కొలతలు వేస్తున్న అధికారులు

పాములపాడు: ఆర్అండ్‌బీ, పంచాయతీ రహదారుల్లో ఉన్న అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటరులో రహదారికిరువైపులా కొలతలు వేశారు. సుమారు వారం క్రితమే దుకాణ దారులందరికీ నోటీసులు ఇవ్వడం జరిగిందని చెప్పారు. రహదారిలో అక్రమ నిర్మాణాల వల్ల ప్రజలకు అసౌకర్యంగా ఉందన్నారు. బస్సులు నిలవడానికి కూడా ఇబ్బందికరంగా ఉందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రంగనాయక్, పంచాయతీ కార్యదర్శి నాగేషులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి



ఆశా వర్కర్లకు సలహాలు, సూచనలు ఇస్తున్న సూపర్‌వైజర్ రాముడు

జూపాడుబంగ్లా: ఆశావర్కర్లు సర్వేలు సకాలంలోపూర్తి చేయడంతో పాటు సకాలంలో విధులు నిర్వర్తించాలని డాక్టర్ సభా, హెల్త్‌సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మమ్మ సూచించారు. మంగళవారం ఆశాడే సందర్భంగా ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లు గర్భిణుల రిజిస్ట్రేషన్ పక్కాగా చేయించటంతో పాటు వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్‌కారీ కాల్స్ వినిపించాలన్నారు. అలాగే ఎన్‌సీడీసీ, లెప్రసీ, హెచ్‌బీఎస్‌సీ, హెచ్‌బీవైసీ, ఏఎన్‌సీల సర్వే సకాలంలో పూర్తిచేయటంతో పాటు ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు.

7న టెన్త్ టాలెంట్ టెస్ట్



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలో ఈనెల 7వ తేదీన ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.దినేష్‌కుమార్, ఆత్మకూరు మండల అధ్యక్ష కార్యదర్శులు సాయి, ప్రశాంత్ అన్నారు. మంగళవారం వారు స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే మార్కులు, ర్యాంకులు, గ్రేడ్‌లు, సంపాదించి తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఈ పరీక్షలో పదో తరగతి సిలబస్ నుంచి 100 మార్కుల ప్రశ్నలు ఉంటాయన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష ఉంటుందన్నారు. సమాచారం కోసం 63032 61839, 63018 55823, 89779 56492 నంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు బాలాజీ, అంజిబాబు, దిలీప్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓంకార క్షేత్రంలో బహిరంగ వేలం

బండి ఆత్మకూరు : మండల పరిధిలోని ఓంకార క్షేత్రంలో వ్యాపార సముదాయాల నిర్వహణ కోసం బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ నాగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ప్రారంభానికి ముందు రూ.10 వేల డిపాజిట్ చెల్లించాలన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

- శ్రీశైల దేవస్థానంలో ప్రత్యేక పూజలు
- సంప్రదాయబద్ధంగా సూర్యారాధన
- నందికొట్కూరులో సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దేవస్థాన ఈఓ దంపతులు,



ఆలయంలో సూర్యయంత్ర పూజ

శ్రీశైలంటెంపుల్: రథసప్తమి (మాఘ శుద్ధ సప్తమి) పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆలయ ప్రాంగాణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో సంప్రదాయబద్ధంగా సూర్యారాధన జరిపించారు. కార్యక్రమానికి ముందుగా ఆలయ అర్చకులు, వేదపండితులు లోకకల్యాణ సంకల్పాన్ని పఠించారు. అలాగే కలశస్థాపన చేసి కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపారు. అనంతరం వైదికాచార్యులు ఆయా బీజ మంత్రాలతో, ప్రత్యేక ముద్రలతో సూర్యనమస్కారాలు చేశారు. కార్యక్రమంలో భాగంగానే సూర్యయంత్ర పూజ, వేదపారాయణలు, అరుణపారాయణం చేపట్టారు. అనంతరం సూర్యభగవానుడికి ఉత్తరపూజనము (షోడశోపచారపూజ), నివేదన, మంత్రపుష్పము నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన ఈఓ ఎం. శ్రీనివాసరావు దంపతులు, అర్చకస్వాములు, వేదపండితులు పాల్గొన్నారు.

మహానందిలో వైభవంగా రథసప్తమి వేడుకలు

మహానంది: రథసప్తమి సందర్భంగా మహానందిలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. రథసప్తమి పూజల్లో రాష్ట్ర దేవదాయశాఖ జేసీ చంద్రశేఖర ఆజాద్ పాల్గొన్నారు. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, ఉపప్రధానార్చకులు వనిపెంట జనార్దనశర్మ, అర్చకులు రఘుశర్మ, సురేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యనమస్కారాలు, అర్ఘ్య ప్రదానాలు, రథాంగ దేవతలకు మహానివేదన సమర్పణ పూజలు చేశారు. రథంలోని దేవతలను శాస్త్రోక్త పూజలతో ఆవాహన చేసి రథాన్ని భక్తుల చేత బయటికి లాగించారు. పూజా కార్యక్రమాల్లో ఏఈఓ ఎరమల మధు, ఆలయ, కార్యాలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్ రెడ్డి, దేవిక, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.




మహానందిలో రథసప్తమి పూజల్లో పాల్గొన్న జేసీ చంద్రశేఖర ఆజాద్



రథాన్ని బయటికి లాగుతున్న భక్తులు

ఘనంగా ఛాయ ఉషా సమేత సూర్యనారాయణస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నందికొట్కూరు: రథసప్తమిని పురస్కరించుకొని పట్టణంలోని ఛాయ ఉషాసమేత సూర్య దేవాలయంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే జయసూర్య, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవం చిత్తూరు సురేష్‌కుమార్ శర్మ, నాగభూషణరావు శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పురవీధుల వెంట కల్యాణ మూర్తులను ఊరేగించారు. సూర్యనారాయణ స్వామి వారి ఉపవాసంతో ఆరాధించిన వారి మానవ జీవితం పరమార్థం పొందుదురని ఆలయ అర్చకులు భరత్‌కృష్ణ శర్మ భక్తులకు తెలిపారు. జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్యాల నాగిరెడ్డి, తరుణ్ కుమార్‌రెడ్డి, ఉపేంద్రారెడ్డి, నాగార్జునరెడ్డి, మధీశ్వరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో రథాన్ని లాగుతున్న మహిళలు

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయంలో శ్రీ భూదేవి శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తుల విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో రథోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల రథాన్ని మహిళలు లాగారు. ప్రత్యేకంగా అలంకరించిన సూర్యభగవానుడి చిత్రపటం వద్ద మహిళలు, భక్తులు పూజలు నిర్వహించారు. దేవాలయ అధ్యక్షులు రామయ్య యాదవ్, జక్కా మురళి, శివరామిరెడ్డి, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షులు సూర్యనారాయణశెట్టి పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేకు సన్మానం



జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాలను సన్మానిస్తున్న ఇస్తెమా కమిటీ సభ్యులు

ఆత్మకూరు: పట్టణంలో జనవరి 7, 8, 9వ తేదీల్లో ఇస్తెమా నిర్వహణకు సహకరించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిలను మంగళవారం ఇస్తెమా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ఆత్మకూరులో నిర్వహించిన భారీ ఇస్తెమాకు జిల్లా అధికారులు, ఎమ్మెల్యే సహకారం మరువలేనిదన్నారు. ప్రభుత్వం సైతం రూ.2 కోట్లు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అధికారులకు దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించి ఇస్తెమా మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఇస్తెమా కమిటీ సభ్యులు జబివుల్లా, నూర్‌బేగ్, రజాక్, ఇంజినీర్ ఇషాక్, శాలుపైల్‌మాన్, గౌస్‌లాజం, అల్లీసా, అలీ తదితరులు పాల్గొన్నారు.

మహానందయ్య ఫొటో తొలగింపుపై విమర్శలు



మహానందయ్య ఫొటోను యథాస్థానంలో ఉంచిన దృశ్యం

మహానంది: మహానంది ఆలయ అభివృద్ధిలో నంద్యాలకు చెందిన భైరవజోష్యుల మహానందయ్య పాత్ర ఎంతో కీలకం. నల్లమల అటవీ ప్రాంతంలో వెలిసిన మహానంది అంటే ఎవరికీ తెలియని రోజుల్లో ఆయన నిత్యం ఎడ్లబండిపై నంద్యాల నుంచి వస్తూ మహానందీశ్వరస్వామికి పూజలు నిర్వహించేవారు. 1902 నుంచి 1947 వరకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తగా మహానందయ్య పనిచేశారు. మహానందీశ్వరస్వామి ఆలయంతో పాటు కోదండ రామాలయం, అమ్మవారి ప్రాంగణాల్లో శిల్పాలను చెక్కిన శిల్పులకు తన భూములను బహుమతిగా ఇచ్చిన మహానుబావుడు. అంతే కాకుండా ఇప్పుడున్న ఆలయం మొత్తం ప్రాంగణంలోని సుమారు 55 ఎకరాల భూమి ఆయన విరాళంగా ఇచ్చినదే. అలాంటి మహనీయుని ఫొటో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం దేవదాయశాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్ కార్యాలయానికి వచ్చిన సందర్భంలో మహానందయ్య చిత్రపటాన్ని చూసి ఎవరు ఈయన, ఎందుకు ఉంచారు, తొలగించాలని ఆదేశించారు. అయితే అక్కడున్న వారు ఆయన గురించే చెప్పే ప్రయత్నం చేయడంలో విఫలం కాగా, విలేకరులు వివరించే ప్రయత్నం చేసినా.. ఇలాంటి వారు ఎంతో మంది ఉంటారని, వెంటనే తొలగించాలన్నారు. అయితే ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దేవస్థానం అధికారులు స్పందించి తిరిగి ఆయన చిత్రపటాన్ని యథాస్థానంలో చేర్చారు.

అలరించిన భజన కార్యక్రమం



భజన కార్యక్రమంలో భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై మహానందికి చెందిన ఎస్.రామన్నగౌడ్ బృందం వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గణేశ ప్రార్థన, నల్లమల కొండలలో, శ్రీశైలం శివమయం, ఓం నమశ్శివాయ, నమో భూతనాథ, శివ శివ శంకరా, శ్రీశైల భ్రమరాంబా పలు భక్తి గీతాలను పరమేశ్వరాచారి, ఆవుల వెంకటేశ్వర్లు, మద్దిశెట్టి నాగేంద్రమ్మ, కొట్ల రాముడు, అమరేశ్వరాచారి, ఈశ్వరమ్మ, రామకృష్ణ, రామన్నగౌడ్ తదితరులు ఆలపించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ, ప్రిన్సిపాల్

వెలుగోడు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ బ్రహ్మం నాయక్ సూచించారు. మంగళవారం స్థానిక మోడల్ స్కూల్‌లో భారత ప్రభుత్వం క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో క్లస్టర్ లెవెల్ కబడ్డీ, వాలీ బాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ యువతను చదువుతో పాటు క్రీడల్లో కూడా పాల్గొంటే మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని పెంపొందిస్తుంది అన్నారు. క్రీడలలో గెలుపొందిన యువతకు ప్రిన్సిపాల్ నళిని, మండల విద్యాశాఖాధికారి అధికారి బ్రహ్మం నాయక్ చేతుల మీదుగా మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ప్రేరణ యూత్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు నూలు నాగేశ్వరరావు, నవీన్ కుమార్, వీరబ్రహ్మం, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి



పరమేష్‌నాయుడు(ఫైల్)

పగిడ్యాల: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు పగిడ్యాల గ్రామానికి చెందిన బోయ పెద్ద మద్దిలేటి కుమారుడు పరమేష్ నాయుడు(22) పాలిటెక్నిక్ పూర్తి చేసి తండ్రికి ఆసరాగా వ్యవసాయ పనులు చేసేవాడు. ఇదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఈ వ్యవహారం కాస్తా అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులకు తెలిసి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం. తన ప్రేమ వ్యవహారం బయటకు పొక్కడం, అమ్మాయి కుటుంబీకులు బెదిరించడంతో మనస్థాపానికి గురై నాలుగు రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు కర్నూలు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం రాత్రి మృతి చెందినట్లు స్టేషన్‌కు ఆసుపత్రి వర్గాలు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, కుటుంబ సభ్యులు మంగళవారం పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వారికి ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి స్వాగతం పలికారు. వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

నేడు సర్వసభ్య సమావేశం

బండి ఆత్మకూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ దేరెడ్డి సంజీవరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం. దస్తగిరి తెలిపారు. కావున మండల పరిధిలోని అధికారుల దరూ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. సమావేశానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుతో ప్రజలపై భారం

నందికొట్కూరు: భూ రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుతో సామాన్య ప్రజలపై భారం పడుతోందని సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి భూ రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం తగదన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు లేక అప్పుల ఊబిలో కూరకుపోయి అల్లాడుతుంటే భూ రిజిస్ట్రేషన్ మోపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో సీపీఎం నాయకులు వెంకటస్వామి, నరసింహులు, బాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ప్రాణాంతకం కాదు

మహానంది: క్యాన్సర్ ప్రాణాంతకం కాదని, సరైన సమయంలో చికిత్స తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్‌ఈఓ హుసేన్‌రెడ్డి తెలిపారు. క్యాన్సర్ వ్యాధిపై మంగళవారం తిమ్మాపురంలోని పీహెచ్‌సీ ఆవరణలో స్థానికులకు అవగాహన కల్పించారు.

నాగసుబ్బలచ్చమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆత్మకూరు: వలస కూలీ నాగసుబ్బలచ్చమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నరసింహానాయక్, మండలాధ్యక్షులు నాగేంద్రబాబు, రాజు డిమాండ్ చేశారు.మంగళవారం వారు మాట్లాడుతూ మండలంలోని కురుకుంద గ్రామానికి చెందిన నాగసుబ్బలచ్చమ్మ ప్రకాశం జిల్లా పెద్ద అర్ధవీడు మండలం స్థానికార గ్రామంలో వలస కూలీగా పనికి వెళ్లిందన్నారు. మిరప పండు సాయంత్రం దాకా తెంచి సోమవారం రాత్రి మరణించిందన్నారు.

గవర్నమెంట్ ఆస్పత్రిలో గుండెపోటుకు ఇంజెక్షన్

నందికొట్కూరు: పట్టణానికి చెందిన 55 ఏళ్ల హుసేన్‌బీ ఛాతి నొప్పితో బాధపడుతూ మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వచ్చింది. వైద్యులు రాంబాబు, రాజశేఖర్ ఈసీజీ ద్వారా గుండెపోటు ఉందని గుర్తించి అత్యవసరమైన ఇంజెక్షన్ ఇచ్చి ఆమె ప్రాణాలను కాపాడారు. ఈ ఇంజెక్షన్ విలువ రూ.40 వేల ఉంటుందని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఇంజెక్షన్‌లను ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులోకి తెచ్చారు. అనంతరం ఆమెను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలోని కార్డియాలజీ విభాగానికి 108 ద్వారా తరలించారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



80బన్నూరు వద్ద కందిపంటలో సస్యరక్షణ చర్యలను వివరిస్తున్న ఏఓ కృష్ణారెడ్డి

నందికొట్కూరు: శనగ పంటను లద్దె పురుగు, కాయ తొలిచే పురుగు నివారించేందుకు రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏడీఏ విజయశేఖర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మల్యాల గ్రామ పొలిమేరలో రైతులతో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని అల్లూరు, శాతనకోట, మల్యాల గ్రామాల్లో రబీలో మొక్కజొన్న, శనగ, మినుము పంట పొలాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు తెగుళ్లు సోకకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆబీకేలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

కొత్తపల్లి: పంటల సాగులో రైతులు పంట మార్పిడి విధానం పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ వనరులు కేంద్రం వ్యవసాయాధికారి హేమలత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శివపురం, పెద్దగుమ్మడాపురం గ్రామాలలో మినుము, కంది, పొగాకు పొలాల్లో ఏఓ మహేష్ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గుమ్మడాపురం సర్పంచ్ నక్కా విజయ్‌కుమార్, రెవెన్యూశాఖ సీనియర్ అసిస్టెంట్ సుందర రాజు తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: కందిపంటలో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల మెరుగైన దిగుబడులు సాధించవచ్చునని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన కందిపంటను మద్దతు ధర రూ.7,550లకు విక్రయించుకునేందుకుగాను రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

వెలుగోడు: మండలంలోని అబ్దుల్లాపురం,గుంతకందాల గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు మెలకువలు తెలియజేశారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



విద్యార్థుల స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న డీఈఓ జనార్ధన్ రెడ్డి

బండి ఆత్మకూరు : మండల పరిధిలోని ఈర్నపాడు, సింగవరం గ్రామాల్లోని జెడ్పీహైస్కూల్ విద్యార్థుల స్టడీ అవర్‌ను డీఈఓ పి. జనార్ధన్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులందరూ సమయపాలన పాటించాలన్నారు. సబ్జెక్టుల వారీగా అవగాహన చదివితే ఒత్తిడికి లోనుకాకుండా పురోగతిని సాధించవచ్చని చెప్పారు. ఎంఈఓ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లోని రోడ్ల పరిశీలన



గుమ్మడాపురం జగనన్న కాలనీలోని గ్రావెల్ రోడ్డు కొలతలు వేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలో జగనన్న హౌసింగ్ కాలనీలలోని లేఅవుట్లలోని గ్రావెల్ రోడ్లను క్వాలిటీ కంట్రోల్ ఏఈ అమర్‌నాథ్ మంగళవారం మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పథకం ద్వారా వేసిన గ్రావెల్ రోడ్లను పరిశీలించామన్నారు. ఎర్రమఠం, గుమ్మడాపురం, ముసలిమడుగు, గువ్వలకుంట్ల, నందికుంట గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో మొత్తం 13 లేఅవుట్లను పరిశీలించామన్నారు. ఏపీఓ హరికృష్ణ, పీఆర్ డీఈ ధనిబాబు, ఏఈ మద్దిలేటి, హౌసింగ్ ఏఈ పాండు నాయక్ ఉన్నారు.

భక్తులకు తాగునీటి సమస్య లేకుండా చూడాలి



పెద్దచెరువు చెంచుగూడెం గిరిజనులతో మాట్లాడుతున్నవివిధశాఖల అధికారులు

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైల క్షేత్రానికి కాలినడకన వెళ్లే భక్తులకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ నాగభూషణంశెట్టి, తహసీల్దార్ రత్నరాధిక, సర్పంచ్ నాగలక్ష్మి ఆదేశించారు. మండలంలోని పెద్దచెరువు చెంచుగూడాన్ని మంగళవారం వివిధ శాఖల అధికారులు సందర్శించారు. వారు మాట్లాడుతూ పెద్దచెరువులో చెడిపోయిన బోర్లను మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. అనంతరం చెంచుగూడెంలో గిరిజనుల పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రహ్లాద, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మినుము పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: మినుము పంటకు ఆశిస్తున్న వివిధ రకాల తెగుళ్లను నివారించేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నంద్యాల వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్, శాస్త్రవేత్తలు రామకృష్ణారావు, నీలిమ, చైతన్య, ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. మండలంలోని కరివేన, కృష్ణాపురం, ఆత్మకూరు, కురుకుంద గ్రామాల్లో మినుము పంటలను మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం మినుము పంటలో రసం పీల్చు పురుగులు, తెల్ల, పచ్చదోమ, తామర పురుగులతో పాటు పల్లాకు తెగులు, ఎండు తెగులు, వేరుకుళ్ల తెగులు ఆశించడంతో రైతులకు భారీ నష్టం కలిగిందని చెప్పారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు.